క్లుప్తంగా

పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: మండలంలోని బీరంగుంటలో జరిగిన పోలేరమ్మ ఉత్సవాల్లో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎఫ్‌ఏసీ ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: ఎంపీడీఓ(ఎఫ్‌ఏసీ)గా ఈఓపీఆర్డీ ఎస్.మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. సచివాలయాల్లో సేవలను మెరుగు పరచాలన్నారు. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ, ధ్రువీకరణ పత్రాల జారీని వేగవంతం చేయాలన్నారు. సర్వేలు సకాలంలో చేయించాలన్నారు. జేకేసీ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు.

అచ్చమాంబ పేరంటాల గ్రామోత్సవం



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అచ్చమాంబ పేరంటాలు గ్రామోత్సవం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన యువకులు, మహిళలు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరై అమ్మవారికి మంగళ హారతులు పట్టారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి


ఫ్లెక్సీలను అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

అనుమసముద్రంపేట: ఈ నెల 24న ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు జాబ్‌మేళాకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆమె అందచేశారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు, ప్రచారం నిర్వహించి నిరుద్యోగులను ఇంటర్వ్యూలకు పంపించాలని తెలిపారు. నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపీడీఓ భాస్కర్, ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు బీమా మంజూరు చేయండి

ఉదయగిరి: మండలంలో పసుపు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం త్వరగా బీమా నగదు మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో పసుపు రైతులు బుధవారం మాట్లాడుతూ ఈ ఏడాది దిగుబడి తగ్గిందని, గతేడాది రైతులకు ఎకరాకు రూ.32 వేలు వంతున రైతుల ఖాతాల్లో బీమా నగదు జమ చేసిందన్నారు. ఈ ఏడాది త్వరగా పంపిణీ చేయాలని కోరారు. ఉదయగిరిలో శాశ్వత పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య, పసుపు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని గుండెమడగులలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి ముచ్చటించారు. పనులు కొలతలు ప్రకారం చేసి గరిష్ఠంగా రూ.275 వేతనం పొందాలని సూచించారు. ఆమెతో టీఏ మాల్యాద్రి ఉన్నారు.

దుకాణాలపైకి దూసుకెళ్లిన కారు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు దుకాణాలు దెబ్బతిన్నాయి. ఈ ఘటన మర్రిపాడు మండలం కృష్ణాపురం బస్టాండ్ సెంటర్‌లో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ముట్టుకుందు నరసింహారెడ్డికి చెందిన రూములను అద్దెకు తీసుకొని నాయబ్, ఏసుతోక శ్రీనివాసులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. అయితే బూదవాడ మాజీ సర్పంచ్ ముటుకుందు లక్ష్మీరెడ్డి తన కారును తానే స్వయంగా నడుపుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి దుకాణాలను ఢీకొట్టారు. దీంతో దుకాణాలు దెబ్బతిన్నాయి. ఈ సంఘటనలో లక్ష్మీరెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సమయంలో కారు అదుపు తప్పిన ప్రాంతంలో మనుషులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సర్కారు బడికి సై

- వింజమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల క్యూ
- నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు
- ప్రభుత్వ పథకాలతో బడికి ఆకర్షణ


కొత్త అడ్మిషన్ల కోసం క్యూ కట్టిన విద్యార్థులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా చేరేందుకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. కేవలం వారం రోజుల్లోనే 210 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ నెల చివరకు మరో వంద మంది కొత్తగా చేరే అవకాశం ఉన్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు కల్పన, నాణ్యమైన విద్య, విప్లవాత్మకమైన ప్రభుత్వ పథకాలు అమలుకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలకు మించి మంచి మార్కులు సాధిస్తున్నారు. జగనన్న ఆణిముత్యాలులో జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు బదులు ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. పైసా ఖర్చు చేయకుండా పిల్లలు చదువులు కోసం 11 పథకాలు అమలు చేస్తున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వరకు 1,011 మంది విద్యార్థులు ఉన్నారు.

అభివృద్ధి, పథకాలు, సంక్షేమం

మొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలలంటే ఒక రకమైన ఏహ్యాభావం ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారు. విద్యార్థుల్లో విద్యా సమర్థ్యాన్ని పెంచేందుకు చర్యలతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పథకాలు, సంక్షేమ ప్రణాళికలు తీసుకువచ్చారు. మొదట ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. తరగతి గదుల నుంచి, బయట అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. జగనన్న విద్యాకానుక పేరుతో ఉచితంగా యూనిఫాం, షూ, బ్యాగ్‌లు, పుస్తకాలు, నోట్‌బుక్స్ ఇలా ఏ విద్యార్థి రూపాయి ఖర్చు లేకుండా స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఉదయం రాగి జావ, సాయంత్రం పూట స్నాక్స్ ఇలా మెనూను సమూలంగా మార్పు చేశారు. అమ్మఒడి పథకాన్ని అమలు చేసి చదువునే పిల్లలను పనులకు పంపించకుండా బడులకు పంపించే ప్రణాళికను అమలు చేస్తున్నారు. దీంతో చదువులకు సంబంధించి ఇంగ్లిష్ మీడియం, బైజుస్‌తో ఒప్పందం చేసుకుని సీబీఎస్ఈ సిలబస్ విద్యను అందిస్తున్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వడంతో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు చాలా మెరుగుపడుతున్నాయి. విద్యలో రాణించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలతో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపించిన విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రోత్సాహాలు అందించడంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు.

చదువు బాగా చెప్తారు



ఈ పాఠశాలలో పాఠాలు బాగా చెబుతున్నారు. మంచి మార్కులు వస్తున్నాయి. మేము మా గ్రామంలో ఉన్న పాఠశాల వదలి వేసి ఇక్కడ చేరుతున్నాం. ఇంకా చాలా మంది ప్రైవేట్ స్కూళ్లు వదిలి వేసి వస్తున్నారు.

– విద్యార్థులు, చీమలవారిపాళెం

మౌలిక వసతులు పెంచాలి



పాఠశాలలో చేరే అడ్మిషన్లు చాలా ఉన్నాయి. ఉన్న మరుగుదొడ్లుకు అదనంగా టాయిలెట్లు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. పిల్లలకు ఫర్నిచర్ వసతి కల్పించాలి. నాణ్యమైన విద్య అందించేందుకు మా ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషి చేస్తోంది.

– మాలకొండయ్య, హెచ్‌ఎం, వింజమూరు

మున్సిపల్ బస్టాండ్ ప్రారంభ ఏర్పాట్లు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్థాపించిన ఎంజీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.4.50 కోట్లతో నిర్మించిన మున్సిపల్ బస్టాండ్ ప్రారంభం శుక్రవారం కానుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభం కానున్న మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో స్టేజీ నిర్మాణం, బహిరంగ సభ ఏర్పాట్లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి జరగనుందని ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పార్టీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, కొండా వెంకటేశ్వర్లు, రహీం, జమీర్, కలాం, బాల అంకయ్య, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తోడేటి మణి, కొండా రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వరికుంటపాడు: తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సయ్యద్ ఇక్బాల్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ మండల నేతలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. మండలం పరిస్థితి, నెలకొన్న రెవెన్యూ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆంధ్రా బాలగురవారెడ్డి, మాజీ కన్వీనర్లు, గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం నాయకులు నాగిరెడ్డి, డక్కునూరు సర్పంచ్ ఉండేల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రెహమాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉన్నందున విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోపు ఆధార్ కార్డుతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. 9వ తరగతి బాలికలకు హాస్టల్ సదుపాయం కూడా ఉన్నట్లు చెప్పారు.

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జే సైమన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీట్లను ఎంట్రన్స్ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 22, 23 తేదీల్లోగా పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 7వ తరగతిలో 20, 8వ తరగతిలో 15, 9వ తరగతిలో 15 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆదివారం సాయంత్రం లోపు మోడల్ స్కూల్‌లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 26వ తేదీ రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94939 17550 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పక్కాఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు

వరికుంటపాడు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు సూచించారు. ఆయన బుధవారం మండలంలోని తూర్పురొంపిదొడ్లలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి పక్కాగృహాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు, డీఆర్‌డీఏ ద్వారా రూ.30 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. వాటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వమే అందించి ఇళ్లు కట్టిస్తుందన్నారు. వలంటీర్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి నూరు శాతం పక్కా గృహాలు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, వలంటీర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

చేజర్ల: యువతీ, యువకులకు ఈ నెల 24వ తేదీ ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేజర్ల మండలం వావిలేరులో సర్పంచ్ గోనుగుంట రాంబాబు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలు సంపాదించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎన్‌జీ గ్యాస్‌ను వినియోగించండి


ఆటోకు సీఎన్‌జీ గ్యాస్‌ను ఫిల్లింగ్ చేసే విధానం చూపుతున్న దృశ్యం

ఆత్మకూరు: పెరిగిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ పరిరక్షణ కోసం సీఎన్‌జీ గ్యాస్ ద్వారా వాహనాలను నడపాలని హెచ్‌పీసీ సీఎన్‌జీ గ్యాస్ రీజనల్ హెడ్ చిరాగ్ కె బన్వాడియా, రీజనల్ మేనేజరు స్వామినాథన్ రమేష్ తెలిపారు. పట్టణంలోని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకులో బుధవారం సీఎన్‌జీ గ్యాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఓ ఆటోకు సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ విధానాన్ని ఆపరేషన్ చేసి చూపారు. వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ వినియోగం పెరుగుతుందని, లభ్యత కంటే ఖర్చు అధికం కావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో సులభంగా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీ గ్యాస్ వాడుకలోకి వచ్చిందని దీనిని వాహనదారులు స్వయంగా పరిశీలించి ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీ మార్కెటింగ్ మేనేజరు ప్రసాద్, హరీష్, ఆర్ఎం భాస్కర్‌రెడ్డి, జిల్లా మేనేజరు డి సురేంద్ర, పెట్రోల్ బంకు యజమాని సురేష్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

దుత్తలూరు: దుత్తలూరులోని సీడ్స్ స్వచ్ఛంద సంస్థలో 45 రోజుల పాటు ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో వన్‌టైం ట్రావెల్ సదుపాయం కలదని, 18–29 ఏళ్లలోపు మహిళలు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులన్నారు. వివరాలకు 99082 17465 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం


ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ అధికారులు మండల స్థాయి క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. బ్యాంకింగ్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి క్విజ్ పోటీలు నిర్వహించగా విశ్వనాథరావుపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ప్రథమ స్థానం సాధించగా, పాతబిట్రగుంట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ద్వితీయ స్థానం, జువ్వలదిన్నె విద్యార్థిని తృతీయ స్థానం సాధించారు. విజేతలకు సర్పంచ్ గండూరి మంజుల బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్బీఐ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఆనందరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ప్రథమ స్థానంలో నిలిచిన వింజమూరు విద్యార్థులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వింజమూరు బాలికల పాఠశాల విద్యార్థులకు రూ.4వేలు, తృతీయ స్థానంలో గుండెమడగుల పాఠశాల విద్యార్థులకు రూ.3 వేలు బహుమతులను అందజేశారు. విజేతలకు ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం మాలకొండయ్య, ఇతర ఉపాధ్యాయులు మదార్, రాము, సలామ్ ఉన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ స్థాయి క్విజ్ పోటీలు స్థానిక లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయిలో శ్రీకొలను జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎన్.జ్యోత్స్న, చిరమనజెడ్పీహెచ్ఎస్ విద్యార్థి వీ అకీరానందన్, డీ హారిక వరుస స్థానాల్లో నిలిచారు. వీరికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు వంతున ప్రైజ్ మనీ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం జరిగిన కార్యక్రమంలో నగదు, ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

చేజర్ల: బ్యాంక్ మేనేజర్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. మండల స్థాయిలో చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. మాముడూరు హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినులు కుమారి చందన లక్ష్మి, జి.గీతిక ప్రథమ స్థానంలో నిలిచారు. ఆదూరుపల్లి, చేజర్ల విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ఎంఈఓ–2 మస్తానయ్య, ఎస్‌బీఐ మేనేజర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హైమావతి, మాముడూరు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని టీజేఎస్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 9 ఉన్నత పాఠశాలల నుంచి 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో చిలకలమర్రి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి కే గణేష్, వై.హారిక ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.


విద్యార్థులతో బ్యాంకు అధికారులు

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం


ఆత్మకూరు: యోగాపై శిక్షణ ఇస్తున్న బ్రహ్మకుమారి


కావలి: యోగాసాధన చేస్తున్న సాధకులు


చేజర్ల: యోగా చేస్తున్న డీఎంహెచ్ఓ

కావలి: ఆరోగ్యకరమైన జీవన విధానం, మానసిక ప్రశాంతత యోగాతోనే సాధ్యమని కావలి మున్సిపల్ కమిషనర్ కిరణ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జేబీ కళాశాల ప్రాంగణంలో ఉన్న డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి ఇండోర్ స్టేడియంలో కావలి రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సామూహిక యోగా ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని పలు యోగా కేంద్రాలు, ధ్యాన శిక్షణా కేంద్రాలకు చెందిన నిర్వాహకులు, యోగా సాధకులు, వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామూహికంగా యోగాసనాలు వేసి యోగా ప్రాధాన్యతను వివరించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడిని జయించడంతో పాటు అన్నీ వయస్సుల వారికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా శిక్షకులు జనార్దన్ గురూజీ, సావిత్రి గురూజీ యోగా, ధ్యాన సాధనలు చేయించారు. పట్టణంలో యోగా, ధ్యాన శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, జేబీ కళాశాల డైరెక్టర్ మాల్యాద్రి, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్సార్‌లో యోగా దినోత్సవం

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే రాజారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడిని జయించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆర్వీ రమణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఏ కిరణ్‌కుమార్, వై కిరణ్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్, రోటరాక్ట్ విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రజ్ఞ యోగ కేంద్రంలో బుధవారం వేడుకలు నిర్వహించారు.సందర్భంగా యోగా గురువు గుడిపాటి ప్రసాదాచారి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తమ దిన చర్యలో భాగంగా యోగ, వ్యాయామాన్ని చేయాలని సూచించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే వారికి యోగా ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఆరోగ్యం, శరీర సౌష్టవం కోసం ప్రతి రోజూ యోగా చేసేందుకు కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధ రమణయ్య పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పరిరక్షించుకోండి

ఆత్మకూరు: ప్రతి నిత్యం క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తూ ఆరోగ్యం పరిరక్షించుకోవాలని బ్రహ్మకుమారీలు సుమతి, సుకన్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారి కార్యాలయం మేడపై పలు పాఠశాలల విద్యార్థులకు యోగాపై బుధవారం అవగాహన కల్పించారు. యోగా సాధనతో ఏకాగ్రత పెరిగి చదువుల్లో రాణిస్తారని తెలిపారు. ఆయా పాఠశాలల నిర్వాహకులు రామ్మోహన్ రెడ్డి, టీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

చేజర్ల: యోగా చేయడం వల్ల ఆరోగ్యం, ఆనందానికి దోహదం చేస్తాయని డీఎంహెచ్ఓ ఎం.పెంచలయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఆదూరుపల్లి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత మంచి ఆరోగ్యం ఉంటుందన్నారు. విద్యార్థినులకు యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రోగ్రామ్‌లకు సంబంధించి రికార్డును పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గొల్లపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యులు ప్రమీలారాజకుమారి, నవీన్‌కుమార్ రెడ్డి, జ్యోతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో యోగా దినోత్సవ వేడుకలు

ఆత్మకూరురూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు యోగాసనాలు చేయించారు. కనుపూరుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మాలకొండలరావు, పెంచలరెడ్డి, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఉదయగిరి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల, ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కొండాయపాళెం సచివాలయంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జున్‌రావు, హెచ్‌ఎం భిక్షాల్, ఫడ్స్ డైరెక్టర్ రమణయ్య, వీఆర్వో వెంకట్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కరటంపాడు పాఠశాలలో విద్యార్థుల యోగా


యోగా శిక్షణ ఇస్తున్న యోగా గురువు ప్రసాదాచారి


యోగాపై అవగాహన కల్పిస్తున్న రమణయ్య

డస్ట్‌బిన్స్ పంపిణీ

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇంటింటికి డస్ట్‌బిన్స్ పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేత నీలం సాయికుమార్ ప్రారంభించారు. స్థానిక అల్లూరు–1 సచివాలయం పరిధిలో పలువురుకి డస్ట్‌బిన్స్‌లను అందజేశారు. ప్రజలకు స్వచ్ఛభారత్ ఆవశ్యకతను తెలియజేశారు. చెత్తను బయట వేయకుండా డస్ట్ బిన్‌లో వేయాలన్నారు. ప్రజలకు మూడు రకాల తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ కన్వీనర్లు బత్తల సుధాకర్, షేక్ జంషీర్, ఉస్మాన్, రసూల్, రాజేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



అల్లూరు: మండలంలో కొత్తగా ఎంపికైన వారికి బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శశిరేఖ నియామక పత్రాలను అదజేశారు. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న వలంటీర్లు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అందజేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ శ్రీదేవి, నాయకులు నీలం సాయికుమార్, ఉస్మాన్ షరీఫ్, చెంతాటి కరుణాకర్, పరిశినేటి రాజేష్, వెంకయ్య, బత్తల సుధాకర్, షేక్ రసూల్, షేక్ జంషీర్, ప్రతాప్ పాల్గొన్నారు.